సాక్షి సిద్దిపేట

శనివారం । 23 । ఆగస్టు । 2025


దుబ్బాకలో యూరియా కోసం మహిళా రైతుల నిరీక్షణ


మిరుదొడ్డిలోని పీఏసీఎస్ కేంద్రం వద్ద క్యూలో పెట్టిన చెప్పులు

యూరియా.. తిప్పలు ఇంతింత కాదయా

- అర్ధరాత్రి నుంచే క్యూలైన్‌లో రైతులు
- రోజంతా 'చెప్ప' కోలేని పాట్లు

జిల్లాలో యూరియా కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. మిరుదొడ్డి పీఏసీఎస్ కేంద్రానికి శుక్రవారం యూరియా లారీ వస్తుందని తెలుసుకున్న పలు గ్రామాలకు చెందిన రైతులు అర్ధరాత్రి నుంచే క్యూ కట్టారు. ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్తే లైను పోతుందేమోనన్న బెంగతో చెప్పులను క్యూలో పెట్టి బయటకు వెళ్లారు. మహిళా రైతుల పరిస్థితి అంతాఇంతా కాదు. సుమారు 3 వేల మంది రైతులు బారులు తీరడంతో టోకెన్లు ఇవ్వడానికి అధికారులకు సైతం తిప్పలు తప్పలేదు. టోకెన్ కౌంటర్ ఒకటే ఉండటంతో రైతుల మధ్య కాసేపు తోపులాటకు దారి తీసింది. యూరియా లారీ రావడంతో టోకెన్లు అందుకున్న రైతులకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. అందనివారు నిరుత్సాహంగా వెనుదిరగాల్సి వచ్చింది. దుబ్బాకలోనూ ఇదే దుస్థితి నెలకొంది. వచ్చిన 560 సంచుల కోసం 2 వేల మందికి పైగా బారులు తీరడం విశేషం. హుస్నాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు మంత్రి తుమ్మల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. దౌల్తాబాద్‌లోని రైతు వేదిక వద్ద రైతులు యూరియా కోసం గంటలకొద్దీ నిరీక్షించారు.

– మిరుదొడ్డి(దుబ్బాక)/దుబ్బాకటౌన్/హుస్నాబాద్


మిరుదొడ్డి(దుబ్బాక): టోకెన్ కౌంటర్ వద్ద రైతుల తోపులాట


హుస్నాబాద్‌లో మంత్రి తుమ్మల దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


దుబ్బాక పట్టణంలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

న్యూస్‌రీల్

హౌసింగ్ ఏఈ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్

సిద్దిపేటరూరల్: ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్న మేస్త్రీ నుంచి డబ్బులు డిమాండ్ చేసిన హౌసింగ్ ఏఈ వెంకయ్యను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ హైమావతి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రూరల్ మండలం వెంకటాపూర్‌లో ఇళ్లు నిర్మిస్తున్న మేస్త్రీని ఏఈ డబ్బులు డిమాండ్ చేసిన విషయంపై ఈనెల 20న 'ఇందిరమ్మ ఇళ్లలో అధికారుల చేతివాటం' అనే శీర్షికతో సాక్షిలో కథనం ప్రచురితమైంది. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ విచారణ చేపట్టాల్సిందిగా జెడ్పీ సీఈఓ రమేశ్‌ను ఆదేశించారు. నివేదిక ఆధారంగా ఏఈని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

13న జాతీయ లోక్ అదాలత్


మాట్లాడుతున్న ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి

సిద్దిపేటకమాన్: జాతీయ లోక్ అదాలత్ వచ్చే నెల 13న నిర్వహించనున్నట్లు, ఇందులో అధిక మొత్తంలో కేసులు రాజీ చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ అథారిటీ చైర్‌పర్సన్ సాయిరమాదేవి తెలిపారు. జిల్లా కోర్టు భవనంలో ఇన్సూరెన్స్ కంపెనీ మేనేజర్స్, స్టాండింగ్ కౌన్సిల్, బ్యాంకు మేనేజర్లతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాజీ పడే కేసులన్నీ లోక్ అదాలత్‌లో పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గోదారి గలగలలు

మల్లన్న సాగర్‌లోకి కొనసాగుతున్న పంపింగ్


మల్లన్న సాగర్‌లోకి వస్తున్న గోదావరి జలాలు

తొగుట(దుబ్బాక): మల్లన్న సాగర్ రిజర్వాయర్‌లోకి గోదావరి జలాల ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. అధికారులు ఈ నెల 19న రెండు మోటార్ల ద్వారా పంపింగ్ ప్రారంభించారు. రోజుకు 2,500 క్యూసెక్కుల నీటిని రెండు మోటార్ల ద్వారా పంపింగ్ కొనసాగింది. శుక్రవారం మరో నాలుగు మోటార్ల ద్వారా పంపింగ్‌ను ప్రారంభించారు. ఆరు మోటార్లతో రోజుకు 7,500 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నట్లు నీటిపారుదల శాఖ డీఈఈ చెన్ను శ్రీనివాస్‌రావు తెలిపారు.

నానో యూరియా వాడండి


మాట్లాడుతున్న ఏడీఏ రాధిక

కొమురవెల్లి(సిద్దిపేట): యూరియా కోసం బారులు తీరి సమయం వృథా చేసుకోవద్దని ఏడీఏ రాధిక సూచించారు. శుక్రవారం కొమురవెల్లి రైతువేదికలో ఏర్పాటు చేసిన రైతుల సదస్సులో ఇఫ్కో ప్రతినిధులతో కలిసి నానో యూరియాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క యూరియా బస్తా.. నానో యూరియా 500 ఎంఎల్‌తో సమానమని తెలిపారు. నానో యూరియాను పిచికారీ చేసుకోవాలని సూచించారు. దీంతో పంటలు ఏపుగా పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఇఫ్కో మేనేజర్, ఏఓ, ఏఈఓలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిద్దిపేటరూరల్: నూతన గ్రామ పంచాయతీలకు రూ.2.60 కోట్లు మంజూరు చేయడంపై కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం నారాయణరావుపేటలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. వారు మాట్లాడుతూ శేఖర్‌రావుపేట పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు, జక్కాపూర్‌లో అంగన్‌వాడీ సెంటర్‌కు రూ.16 లక్షలు కేటాయించడం సంతోషకరమన్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంటే మరోవైపు బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు.

ఇక అటవీ శాఖ ముద్ర

- చెట్ల నరికివేతకు అనుమతి తప్పనిసరి
- ప్రభుత్వ శాఖల మధ్య కోల్డ్ వార్‌కు చెక్
- ట్రాన్స్‌కోకు నోటీసుల జారీలో మున్సిపల్ యంత్రాంగం

పిట్టపోరు.. పిట్టపోరు.. పిల్లి తీర్చినట్లు జిల్లా కేంద్రంలో విద్యుత్, మున్సిపల్ శాఖల మధ్య కొంతకాలంగా నెలకొన్న చెట్ల నరికివేత అంశం అటవీశాఖ చేతుల్లోకి వెళ్లింది. ఇక నుంచి పట్టణంలో చెట్లు నరికివేసేందుకు అటవీశాఖ అనుమతి తప్పనిసరి. ఈ మేరకు మున్సిపల్ అధికారులు.. అటవీశాఖ అనుమతి పత్రం ఉంటేనే పట్టణంలో హరిత హారం చెట్లను తొలగించాలని ట్రాన్స్‌కోకు అధికారికంగా నోటీసులు జారీ చేసే పనిలో ఉన్నారు.


సిద్దిపేట మున్సిపాలిటీలో నరికిన హరితహారం చెట్లు (ఫైల్)

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో కొన్నేళ్లుగా హరిత హారం కింద మొక్కలు నాటారు. అదే క్రమంలో ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాల మేరకు వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటుతున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. కొంత కాలంగా విద్యుత్ వైర్లను పొడవాటి చెట్ల కొమ్మలు తాకడం, విద్యుత్ సరఫరాలో సమస్యల దృష్ట్యా విద్యుత్ శాఖ చెట్లను తొలగిస్తోంది. క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ, ఇరు శాఖల సమన్వయ లోపంతో కొన్ని ప్రాంతాల్లో చెట్ల మొదళ్ల వరకు తొలగించారు. ఇదే అంశంపై ఇరు శాఖల్లో కొంత అగాధం ఏర్పడింది. ఈ క్రమంలో ఇరు శాఖలు ఎవ్వరికీ వారు యమునా తీరు అన్నట్లు వ్యవహరించాయి.

పెద్ద ఎత్తున జరిమానాలు

మరోవైపు పట్టణంలో ఏపుగా పెరిగిన చెట్లను వివిధ కారణాలతో పలువురు తొలగించారు. అలాంటి సంఘటనలపై బల్దియా స్పందించి జరిమానాతోపాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుల వరకు వెళ్లింది. రూ.500 నుంచి రూ.లక్ష వరకు జరిమానా రూపంలో బల్దియా విధించింది. ఈ లెక్కన ప్రతి ఏడాది సగటున రూ. 50 వేలు జరిమానా పేరిట బల్దియాకు ఆదాయం సమకూరింది.

అటవీశాఖ జోక్యం

విద్యుత్, మున్సిపల్ శాఖల మధ్య నెలకొన్న సమస్య పరిష్కారానికి అటవీశాఖ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. నిబంధనలకు విరుద్ధంగా చెట్లను నరకడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇక భవిష్యత్తులో ప్రభుత్వ శాఖలు, ఇతర వ్యక్తులు చెట్లను తొలగించే అంశంపై అటవీశాఖ అనుమతి తప్పనిసరి అని నిబంధన విధించింది. అందుకు అనుగుణంగా ఇరు శాఖలకు సూచనలు చేసింది. ఇప్పటివరకు విద్యుత్, మున్సిపల్ శాఖల పరస్పర అవగాహన మేరకు విద్యుత్ వైర్ల కింద ఉన్న చెట్లు తొలగించారు. ఇక భవిష్యత్తులో ఇరు శాఖలు అటవీశాఖ అనుమతి పొందాల్సి ఉంటుంది. అందులో భాగంగానే పట్టణంలో చెట్లు నరికేందుకు అటవీశాఖ అనుమతి లేఖ బల్దియాకు అందజేయాలని మున్సిపల్ అధికారులు విద్యుత్ శాఖకు అధికారికంగా నోటీస్ జారీ చేసే పనిలో నిమగ్నమైంది.

అనుమతి ఉంటేనే..

సిద్దిపేట మున్సిపాలిటీ పరిధిలో చెట్లను తొలగించడానికి అటవీశాఖ నుంచి అనుమతి తప్పనిసరి. అందుకు సంబంధించిన అంశాలను నోటీసు రూపంలో విద్యుత్ శాఖ అధికారులకు పంపించడానికి చర్యలు తీసుకుంటున్నాం. – ఆశ్రిత్, మున్సిపల్ కమిషనర్

అభివృద్ధి నిరంతర ప్రక్రియ

- గ్రామాలను ప్రగతి బాట పట్టిస్తాం
- త్వరలో గౌరవెల్లిని నింపి సస్యశ్యామలం చేస్తాం
- మంత్రి పొన్నం ప్రభాకర్

అక్కన్నపేట(హుస్నాబాద్): అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమం శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మండలంలోని కట్కూర్, గొల్లకుంట, అక్కన్నపేట, కేశనాయక్‌తండా, కుందనవానిపల్లి, గండిపల్లి, రామవరం, మల్‌చెర్వుతండా, గోవర్ధనగిరి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణానికి శంకుస్థాపనలు, నూతన జీపీ కార్యాలయాలను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎక్కడికక్కడా అభివృద్ధి నిలిచిపోయిందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రామాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

హుస్నాబాద్‌కు గుండెకాయ గౌరవెల్లి

గౌరవెల్లి ప్రాజెక్టు హుస్నాబాద్‌కు గుండెకాయ లాంటిదన్నారు. ప్రాజెక్టు కోసం ఈ ప్రాంత రైతాంగం ఏళ్లుగా ఎదురుచూస్తోందన్నారు. త్వరలో ఎన్జీటీ కేసును సైతం తొలగిస్తామన్నారు. అందరి సహకారంతో త్వరలో గౌరవెల్లి గోదావరి జలాలతో నింపి ఈ ప్రాంతాన్ని పూర్తిగా సస్యశ్యామలం చేస్తామన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం..

నందారం, కపూర్‌నాయక్‌తండా గ్రామాల్లో


గండిపల్లిలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం

నెలకొన్న భూ సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి చెప్పారు. కొన్నేళ్లుగా సాగు చేసుకుంటూ జీవిస్తున్న రైతులకే పట్టా హక్కులు కల్పించేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ హైమావతి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

హుస్నాబాద్‌రూరల్: పల్లె ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి పొన్నం వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలంలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించాలనే మీర్జాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రూ.2కోట్లతో నిర్మించామని అన్నారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళ సంఘాలకు స్టీల్ బ్యాంక్‌ను అందించారు.

యూరియాపై ఆందోళన వద్దు

యూరియా కోసం ఎలాంటి ఆందోళన వద్దని, కేంద్ర ప్రభుత్వం సరఫరాలో అలసత్వం వహిస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. అక్కన్నపేట మండల కేంద్రంలో విశాల పరపతి సంఘం ఎదుట యూరియా కోసం రైతులు బారులు తీరడం చూసి అక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యూరియా కోసం ఇబ్బందులు పడవద్దని, కాంగ్రెస్ ఎంపీలు ఢిల్లీలో సరిపడా యూరియా అందించాలని ఆందోళన చేశారన్నారు. త్వరలోనే


అక్కన్నపేటలో రైతులతో మాట్లాడుతున్న మంత్రి

యూరియా సరఫరా అవుతుందన్నారు. కొందరు రైతులు మాట్లాడుతూ మూడు రోజులుగా తిరుగుతున్నా యూరియా దొరకడంలేదన్నారు. ప్రస్తుతం వరి పొలాలు పొట్ట దశలో ఉన్నాయని, ఇప్పుడు యూరియా చల్లకపోతే నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు.

మెప్మాలో బయటపడిన అక్రమాలు

- బాధ్యులపై అధికారుల చర్యలు
- సీఓపై సస్పెన్షన్ వేటు, ఆర్‌పీ, ఎస్ఎల్ఎఫ్ తొలగింపు

గజ్వేల్: మున్సిపాలిటీలోని మెప్మా(పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) విభాగంలో చోటుచేసుకున్న అక్రమాలపై చేపట్టిన విచారణ కొలిక్కి వచ్చింది. ఇటీవల కాలంలో ఈ అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. మహిళా సంఘాల సభ్యులకు చెందిన డబ్బులను వారి సొంత అకౌంట్లలో వేసుకొని వాడుకున్నారని మెప్మాకు చెందిన సీఓ సరిత, ఆర్‌పీ కృష్ణలీల, సరస్వతీ స్లమ్ సమాఖ్య (ఎస్ఎల్ఎఫ్) అధ్యక్షురాలు మంజులపై ఆరోపణలు వచ్చాయి. ఈమేరకు బాధిత మహిళలు అధికారులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదులు చేశారు. ఈక్రమంలోనే ఈ వ్యవహారంపై దఫలవారీగా విచారణ జరిగింది. విచారణలో సీఓ, ఆర్‌పీ, ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలి అక్రమాలు బయటపడ్డాయి. ఈ సందర్భంగా బ్యాంకు ఖాతాలు, లావాదేవీలవారీగా విచారణ జరిపితే ఎన్నో విషయాలు వెలుగులోకి వచ్చాయి. భారీఎత్తున డబ్బులను తమ సొంత అవసరాలకు వాడుకున్నట్లు తేలింది. ఫలితంగా సీఓపై సస్పెన్షన్ వేటు వేయడమేకాకుండా ఆర్‌పీ, ఎస్ఎల్ఎఫ్ అధ్యక్షురాలిని తొలగించారు. విషయాన్ని మున్సిపల్ కమిషనర్ శుక్రవారం ధ్రువీకరించారు.

విజిలెన్స్ అధికారి సందర్శన

సిద్దిపేటరూరల్: చింతమడకలో నిర్వహించిన ఉపాధి హామీ సోషల్ ఆడిట్ గ్రామసభలో శుక్రవారం రాష్ట్ర చీఫ్ విజిలెన్స్ అధికారి ఉమారాణి పాల్గొన్నారు. ఉపాధి కింద చేపట్టిన పనులను పరిశీలించారు. అనంతరం నిర్మించిన పశువుల పాక ప్రారంభించారు. మల్టీపర్పస్ వర్కర్స్, ఉత్తమ కూలీలు, నర్సరీ వాచ్ అండ్ వాచ్‌లను ఆమె సన్మానించారు.

ఆన్‌లైన్ గేమ్స్‌పై నిఘా ముమ్మరం

సీపీ అనురాధ

హుస్నాబాద్: ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లపై నిఘా ముమ్మరం చేసినట్లు పోలీస్ కమిషనర్ అనురాధ అన్నారు. శుక్రవారం హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని సీపీ సందర్శించారు. సీజ్ చేసిన వాహనాలు, రిసెప్షన్ రికార్డు, రైటర్ గదిని పరిశీలించి స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుస్నాబాద్ పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు పోలీస్ శాఖకు సహకరించాలన్నారు. వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా టీపీఓలు నిమజ్జనం పూర్తయ్యేంత వరకు తరుచూ గ్రామాలను సందర్శించాలన్నారు. ఇసుక, జూదం, పీడీఎస్ రైస్ అక్రమ రవాణా జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై లక్ష్మారెడ్డి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ గౌడ్, సీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


హుస్నాబాద్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన సీపీ అనురాధ, పోలీస్ అధికారులు

ఊరికి రక్షణ సీసీ కెమెరాలు

హుస్నాబాద్‌రూరల్: ఊరికి రక్షణగా సీసీ కెమెరాలు నిలుస్తాయని సీపీ అనురాధ అన్నారు. శుక్రవారం పోతారం(ఎస్) గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ పల్లెలను సీసీ కెమెరాల నిఘా కిందకు తెచ్చేందుకు ప్రజలతో కలిసి పోలీసులు పని చేయాలన్నారు. ఎంత పెద్ద సమస్య అయినా నలుగురు కూర్చుండి మాట్లాడితే పరిష్కారమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, మాజీ సర్పంచ్ సాయన్న తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ జోరే..



ఉమ్మడి జిల్లాలో రూ. కోట్లలో వ్యాపారం

- గత ఎక్సైజ్ ఏడాది 12,227 దరఖాస్తులు
- రూ. 244.54 కోట్ల ఆదాయం
- ఈసారి మరింత పెరిగే అవకాశం

మెదక్ అర్బన్: కొత్త మద్యం విధానాన్ని ఖరారు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేయడంతో వ్యాపారుల్లో కదలిక ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలో లిక్కర్ వ్యాపారం మూడు క్వార్టర్లు.. ఆరు బీర్లుగా కొనసాగుతోంది. రోజురోజుకు పెరుగుతున్న వినియోగం సర్కారుకు కనకవర్షం కురిపిస్తోంది. ఈసారి వైన్ షాపు దరఖాస్తు ధర పెంచడంతో భారీ ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో 243 వైన్ షాపులు ఉండగా, 2023- 25 ఎక్సైజ్ సంవత్సరానికి 12,227 దరఖాస్తులు వచ్చాయి. ఈ మేరకు రూ. 244.54 కోట్ల ఆదాయం కేవలం అప్లికేషన్ల ద్వారానే సమకూరింది. కాగా ఘనపూర్ ఐఎంఎల్ డిపో నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 2,490 కోట్ల మద్యం కొనుగోలు చేశారు. ఇదిగాక వైన్ షాపుల నుంచి ప్రభుత్వం వసూలు చేసే లైసెన్స్ రుసుము, టర్నోవర్ టాక్స్, ఎక్సైజ్ టాక్స్ అదనం.

ఘనపూర్ ఐఎంఎల్ డిపో నుంచి..

మెదక్, సంగారెడ్డి జిల్లాలలోని 118 వైన్ షాపులు, 16 బార్లకు మెదక్ జిల్లా ఘనపూర్ ఐఎంఎల్ డిపో నుంచి మద్యం, బీర్లు సరఫరా అవుతాయి. 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 2,490 కోట్ల విలువ గల మద్యం కొనుగోలు చేశారు. ఇందులో 26,40,682 కార్టన్ల లిక్కర్, 34,34,238 కార్టన్ల బీర్‌లు కొనుగోలు చేశారు. గత ఎక్సైజ్ సంవత్సరం వ్యవధి సుమారు 100 రోజులు మిగిలి ఉంది. వచ్చే ఎక్సైజ్ సంవత్సరం స్థానిక సంస్థల ఎన్నికలు ఉండే అవకాశం ఉన్నందున, ఈ ఏడాది వైన్ షాపులకు దరఖాస్తులు మరిన్ని ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది. కాగా ప్రస్తుతం మద్యం దుకాణాలు నడుపుతున్న యజమానులు, గతంలో టెండర్ వేసి షాపులు దొరకని వ్యాపారులు, ఇప్పటి నుంచే గ్రూపులు, సిండికేట్లుగా ఏర్పడి టెండర్లలో పాల్గొనడానికి సిద్ధమవుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో వైన్‌షాపుల వివరాలు

సిద్దిపేట	93
మెదక్	49
సంగారెడ్డి	101

ఉమ్మడి జిల్లాలో 243 వైన్ షాపులు

ఉమ్మడి జిల్లాలో 243 ఏ4 వైన్‌షాపులు ఉన్నాయి. 2023- 25 ఎక్సైజ్ సంవత్సరానికి సంగారెడ్డి జిల్లాలో 6,156, మెదక్‌లో 1,905, సిద్దిపేటలో 4,166 దరఖాస్తులు వచ్చాయి. అప్పట్లో అప్లికేషన్ రుసుం రూ. 2 లక్షలు ఉండేది. ఈ లెక్కన కేవలం దరఖాస్తుల రూపేణ రూ. 244.50 కోట్ల ఆదాయం వచ్చింది. ఈసారి దరఖాస్తు ధర రూ. 3 లక్షలకు పెంచడంతో సుమారు రూ.120 కోట్ల ఆదాయం అదనంగా పెరిగే అవకాశం ఉంది.

క్లుప్తంగా

నకిలీ తేనె తయారీ

- వ్యక్తి అరెస్ట్



పోలీసుల అదుపులో మన్సూర్ ఆలమ్

గజ్వేల్‌రూరల్: నకిలీ తేనెను తయారు చేస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని, తయారీకి ఉపయోగించే సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసుల వివరాల ప్రకారం... గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్న బీహార్‌కు చెందిన మన్సూర్ ఆలమ్ నకిలీ తేనెను తయారు చేసి, పరిసర ప్రాంతాల్లోని టీ షాపులు, ఇతర దుకాణాల్లో విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం సాయంత్రం రైడ్ చేసి అదుపులోకి తీసుకున్నారు. అతని ఇంట్లో 20కిలోల హనీ మిక్స్‌డ్(7బాటిళ్లు), అరకిలో పటిక, అరకిలో చక్కెర, 100 గ్రాముల షాంపు, చిన్న గ్యాస్ సిలిండర్ స్టవ్, మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. తేనె బాటిళ్లను కొనుగోలు చేసే సమయంలో నాణ్యతతో కూడినవా? లేవా అనేది సరిచూసుకోవాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

సిలిండర్‌కు మంటలు

తప్పిన ప్రమాదం



బయటకు తీసుకొచ్చిన సిలిండర్లు

నారాయణఖేడ్: పట్టణంలోని రాయిపల్లి రోడ్డు పక్కన ఉన్న ఇందు టిఫిన్ సెంటర్‌లో సిలిండర్‌కు మంటలంటుకుని అగ్ని ప్రమాదం జరిగింది. వివరాలు ఇలా... శుక్ర వారం ఉదయం టిఫిన్ సెంటర్‌లో కస్టమర్లు టిఫిన్ చేస్తుండగా వెనుకభాగంలో ఉన్న వంటగదిలో సిలిండర్‌కు మంటలంటుకున్నాయి. కాగా, వంటగదిలో 10 వరకు సిలిండర్లు ఉన్నా యి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే శకటంతో చేరుకుని ఓ వైపు మంటలు ఆర్పుతూనే మరో వైపు గదిలో ఉన్న సిలిండర్లను బైటికి తీసుకువచ్చారు. టిఫిన్ సెంటర్ జాతీయ రహదారి పక్కన ఉండటం, చుట్టుపక్కల నివాసగృహాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలు ఉండగా సిలిండర్లు పేలితే పెద్ద ప్రమాదం జరిగేది. ప్రమాదంలో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగింది.

బైకు దొంగ అరెస్ట్

పెద్ద శంకరంపేట (మెదక్): బైక్ దొంగను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు.. పెద్ద శంకరంపేట గ్రామానికి చెందిన నామిషంగారి శివశంకర్ కొన్ని రోజులుగా ఈజీగా డబ్బులు సంపాదించేందుకు బైకులు దొంగతనం చేస్తు న్నాడు. గత నెలలో ఉత్తలూరు బ్రిడ్జి కింద పార్క్ చేసిన శివాయిపల్లి గ్రామానికి చెందిన కుక్కల సాయిలు గ్లామర్ బైక్‌ను దొంగిలించాడు. ఈ క్రమంలో ఆ బైకును హైదరాబాదులో అమ్మడానికి తీసుకువెళ్తుండగా ఉత్తలూరు బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా పట్టుబడ్డాడు. బైక్‌ను సీజ్ చేసి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

నేడు, రేపు మెదక్‌లో ఈశా గ్రామోత్సవం

మెదక్ కలెక్టరేట్: ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో దక్షిణ భారత దేశంలోనే అతిపెద్ద క్రీడా ఉత్సవం ఈనెల 23, 24 తేదీల్లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జరగనుంది. ఈ కార్యక్రమంలో పురుషుల వాలీబాల్, మహిళల త్రోబాల్ పోటీల్లో జట్లను ఉచితంగా నమోదు చేసుకుని పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ఆటలు సంప్రదాయ కళలు కూడా నిర్వహించనున్నారు. గెలిచిన మొదటి నాలుగు జట్లకు నగదు బహుమతి ఉంటుంది. ఈ కార్యక్రమానికి అతిథులుగా జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి మాధవి, జిల్లా క్రీడలు యువజన శాఖ అధికారి దామోదర్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. సమాచారం కోసం 9966732612, 8309211806 లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర వ్యాప్తంగా గెజిటెడ్ హెచ్‌ఎం పోస్టులు 884 భర్తీ

విద్యార్థులే లేరు.. ఎవరికి బోధిస్తారు?

- 131 పాఠశాలల్లో 50 మందిలోపు పిల్లలు
- లేని చోట జీహెచ్‌ఎంలు ఎందుకు?
- ఉన్న పాఠశాలలకు పోస్టు షిఫ్ట్ చేయాలి
- విద్యాశాఖ పునరాలోచన చేయాలి : ఉపాధ్యాయులు



సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం తోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 46 మంది విద్యార్థులకు ఏడుగురు ఉపాధ్యాయులున్నారు. గతేడాది హెచ్‌ఎం పదవీ విరమణ పొందగా.. పదోన్నతులలో భాగంగా షాహిన్‌కు పోస్టింగ్ ఇచ్చారు.





వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం శనిగరంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో 22 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఆరుగురు ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. పదోన్నతిపై ఫ్రాన్సిస్‌ను నియమించగా శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు.

ములుగు జిల్లా భూపాల్‌నగర్ (పందికుంట)లోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎనిమిది మంది విద్యార్థులకుగాను ఏడుగురు ఉపాధ్యాయులున్నారు. 6వ తరగతిలో ఇద్దరు, ఏడులో ఒక్కరు ఉండగా కొన్ని రోజులుగా పాఠశాలకు రావడం లేదు. 8వ తరగతిలో విద్యార్థులు లేరు. 9లో ఒక్కరు, పదిలో నలుగురు విద్యార్థులున్నారు.7, 8వ తరగతులు ఖాళీగానే ఉన్నాయి. 9లో ఉన్న ఒక్క విద్యార్థి స్కూల్‌కు రాకపోతే ఆ రోజు క్లాస్ ఖాళీనే. ఇప్పటికే పలువురు ఉపాధ్యాయులకు లీజర్ సమయం ఎక్కువగా ఉంటుంది. విద్యార్థులు లేనిచోట మరో హెచ్‌ఎం పోస్టు భర్తీ చేస్తే అతను సైతం ఖాళీగానే ఉండాల్సిన పరిస్థితి. స్కూల్ అసిస్టెంట్‌ల పదోన్నతితో ఊరుగొండ నుంచి భూపాల్‌నగర్ హెచ్‌ఎంగా సునీత జాయిన్ అయ్యారు. ఆ పోస్టును భర్తీ చేయకుండా అక్కడే ఉన్న ఉపాధ్యాయునికి ఇన్‌చార్జి ఇస్తే బాగుండేది.

సాక్షి, సిద్దిపేట స్కూల్ అసిస్టెంట్ టీచర్లకు గెజిటెడ్ హెడ్మాస్టర్లుగా పదోన్నతులు కల్పించారు. అరకొర విద్యార్థులు ఉన్న పాఠశాలలకు సైతం హెచ్‌ఎంలను నియమించారు. తక్కువ విద్యార్థులున్న పాఠశాలల్లో ఇప్పటికే క్లాసులు లేక ఉపాధ్యాయులు ఖాళీగా ఉంటున్నారు. ఇప్పుడు తాజాగా గెజిటెడ్ హెచ్‌ఎంలను నియమించడంతో పలు విమర్శలకు దారితీస్తోంది.

50 మందిలోపే విద్యార్థులున్న పాఠశాలలు 131

రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్ అసిస్టెంట్లకు 884 పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులను భర్తీ చేసింది. పదోన్నతులపై పలువురు కోర్టుకు వెళ్లడంతో ఈ నెల 20న ఎత్తివేసింది. దీంతో అదేరోజు రాత్రి 9గంటల నుంచి 1:1 చొప్పున జాబితాను ప్రకటించి పోస్టింగ్‌ల కోసం వెబ్ ఆప్షన్లను ఈ నెల 21వ తేదీ ఉదయం 9గంటల వరకు స్వీకరించారు. తర్వాత జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చారు. దీంతో శుక్రవారం పదోన్నతులు పొందిన వారు హెచ్‌ఎంలుగా విధుల్లో చేరారు. 131 పాఠశాలల్లో 50 కంటే తక్కువ విద్యార్థులున్నారు. వాటిలో ఇప్పటికే పలు తరగతులలో అసలు విద్యార్థులు లేక ఉపాధ్యాయులకు ఖాళీ సమయం ఎక్కువగా ఉంటుంది. విద్యార్థులు లేని చోట హెచ్‌ఎంలకు సైతం పని తక్కువగానే ఉంటోంది. కొత్తగా హెచ్‌ఎంను నియమించకుండా అదే పాఠశాలలో ఉపాధ్యాయుడుని ఇన్‌చార్జి హెచ్‌ఎంగా బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు. మళ్లీ నియమించి ఖాళీగా ఉంచడం.. మరో చోటకు డిప్యూటేషన్‌పై పంపించడానికి బదులు నియమించకుండానే మంచిదని పలువురు చర్చించుకుంటున్నారు.

ఉమ్మడి జిల్లా	50 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు
మెదక్	08
వరంగల్	27
నల్గొండ	29
కరీంనగర్	31
ఆదిలాబాద్	09
నిజామాబాద్	08
ఖమ్మం	06
రంగారెడ్డి	03
మహబూబ్‌నగర్	09
హైదరాబాద్	01

పునరాలోచన చేస్తే బాగుండేది

పదోన్నతులు కల్పించి ఖాళీగా ఉంచడం.. మరి కొన్ని చోట్ల ఇతర విధులకు వినియోగించడం కంటే 50 మంది విద్యార్థుల సంఖ్య కంటే తక్కువ ఉన్న చోట గెజిటెడ్ హెచ్‌ఎంను నియమించే విషయంలో రాష్ట్ర విద్యాశాఖ పునరాలోచన చేస్తే బాగుండేదని పలువురు చర్చించుకుంటున్నారు. విద్యార్థులు ఉన్నచోటకు ఈ పోస్టులను షిఫ్ట్ చేసి పదోన్నతులు కల్పించినా బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

సదస్సులతోనే పరిశోధకులకు మార్గ నిర్దేశం

ఐసీఎస్‌ఎస్‌ఆర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి



మెదక్ కలెక్టరేట్: సదస్సులు పరిశోధకులకు మార్గం నిర్దేశం చేస్తాయని ఐసీఎస్‌ఎస్‌ఆర్ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ సదస్సు ప్రారంభమైంది. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ సంస్థ హైదరాబాద్, మెదక్ డిగ్రీ కళాశాల ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సుధాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. అధ్యాపకులు బోధనతోపాటు నిరంతరం పరిశోధన వైపు దృష్టి పెట్టడం వల్ల నూతన ఆవిష్కరణలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఐసీఎస్‌ఎస్‌ఆర్ డైరెక్టర్ ప్రొఫెసర్ పార్థసారథి ఉపన్యాసం ఆసక్తికరంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ , అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ శరత్ రెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమల రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ నాగేందర్‌రావు, శ్రీలత, వెంకటేశ్వర్లు, మల్లేశం, వెంకటేశ్వర్లు, రాజాగౌడ్, వినోద్‌కుమార్, అరుంధతి, సుధారాణి, హరిత, విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో.. తల్లిదండ్రుల కళ్లెదుటే..

యువకుడు ఆత్మహత్య



ఎండపల్లి స్వామి

నిజాంపేట(మెదక్): అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మెదక్ జిల్లా నిజాంపేటలో మండలంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... మండల పరిధిలోని నందిగామ గ్రామానికి చెందిన ఎండపల్లి స్వామి(40) రంగనాయకసాగర్ డ్యామ్, చంద్లపూర్‌లో ప్రైవేట్ సెక్యూరిటీగా పనిచేస్తున్నాడు. రెండేళ్ల క్రితం ఇంటి కోసం చేసిన అప్పులు తీర్చలేక భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు వచ్చాయి. దీంతో భార్య గీత ఇంటి నుంచి వెళ్లిపోయి రామాయంపేటలో పిల్లలతో కలిసి ఉంటుంది. భార్య, పిల్లలు తనతో లేరనే బెంగతో, అప్పులతో మనస్తాపానికి గురయ్యాడు. గురువారం రాత్రి సమయంలో కొడుకు వీడియో చేసి తన తల్లిదండ్రులు చూస్తుండగానే ఇంట్లోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. తల్లిదండ్రులు కిటికీలో నుంచి అరిచి తలుపులు తీసేలోపు చనిపోయాడు.

మరో ఘటనలో మహిళ...



వేల్పుల గంగమణి

మహిళ ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని తాళ్లపల్లికి చెందిన వేల్పుల గంగమణి(50) తన భర్త అంజయ్య గత ఏడాది ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి ఇద్దరు కుమారులు, కూతురు తరచూ గొడవ పడుతుండేవారు. తండ్రి సంవత్సరీకానికి సంబంధించిన కార్యక్రమం కోసం చిన్న కొడుకును అడుగగా గొడవ జరిగింది. దీంతో ఆమె బయటకు వెళ్లి నిజాంపేట మండలంలోని కల్వకుంట గ్రామ శివారులోని మామిడి తోటలో చీరతో ఉరి వేసుకుంది.

కుటుంబ కలహాలతో..

జిన్నారం (పటాన్‌చెరు): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి వివరాల ప్రకారం... మధ్యప్రదేశ్‌కు చెందిన షానికుమార్ పానిక్ (24) ఇటీవల బతుకుదెరువు నిమిత్తం మేడ్చల్ జిల్లా గండిమైసమ్మలో నివాసముంటూ టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య తన సొంత గ్రామం మధ్యప్రదేశ్‌లో ఉంటుంది. ఈ క్రమంలో భార్యతో గొడవపడి తీవ్ర మనస్తాపానికి గురై గురువారం రాత్రి మాదారం గ్రామ శివారులో చెట్టుకు ఉరి వేసుకున్నాడు. మృతుడి తమ్ముడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అప్పు తీర్చే మార్గం లేక..



ఆంజనేయులు

చేగుంట(తూప్రాన్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మాసాయిపేట మండలం పోతాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన తిరుపతి ఆంజనేయులు(49) ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. కొన్ని రోజులుగా అప్పులు తీర్చే మార్గం కనిపించడం లేదని గ్రామస్తులతో చెప్పుకుంటూ బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఈనెల 20న వ్యవసాయ పొలం వద్దకు వెళుతున్నట్లు ఇంట్లో చెప్పి వెళ్లిపోయాడు. కుటుంబీకులు అతడి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేదు. ఆంజనేయులు పొలం సమీపంలో అటవీప్రాంతంలో చెట్టుకు ఉరివేసుకొని కనిపించాడు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

ఉసురుతీసిన భూమి గొడవ



యాదమ్మ

వర్గల్(గజ్వేల్): భూమి విషయంలో జరిగిన గొడవలతో మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండలంలోని మైలారంలో చోటు చేసుకుంది. ఎస్సై కరుణాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పిట్ల యాదమ్మ(53) తమ ఇంటి దగ్గర కొంత భూమి కొనుగోలు చేసింది. ఈ భూమి విషయంలో దాయాదులతో గొడవలు జరుగుతున్నాయి. అనవసరంగా భూమిని కొన్నామని, గొడవలు జరుగుతున్నాయని గురువారం కుమారుడు నరేశ్ తల్లిని మందలించాడు. దీంతో ఆమె బాత్రూమ్‌లోకి వెళ్లి పురుగుల మందు తాగింది. గమనించిన కొడుకు గాంధీ ఆస్పత్రికి తరలించాడు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందింది.

భగీరథ పంప్‌హౌస్‌లో ప్రమాదం

- ముగ్గురికి తీవ్ర గాయాలు

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని మహ్మదాపూర్ మిషన్ భగీరథ పంప్‌హౌస్‌లో గురువారం రాత్రి విద్యుత్ ప్రమాదం జరిగింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధిత కుటుంబ సభ్యుల వివరాలు... హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, భీమదేవరపల్లి, చిగురుమామిడి మండలాలకు తాగునీరు సరఫరా చేయడానికి మహ్మదాపూర్‌లో సంపు నిర్మించారు. సంపు పక్కనే విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండటంతో అప్పుడప్పుడు ఎర్త్ వస్తుందని సిబ్బంది చెప్పినా యాజమాన్యం పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపించారు. కాగా రెండు రోజులు నీటి సరఫరాను నిలిపివేసి పంపులకు మరమ్మతు చేస్తున్న క్రమంలో ఎర్త్ సప్లయి అయి సిబ్బంది ముగ్గురు విద్యుదాఘాతానికి గురయ్యారు. శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలు కాగా ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.


డెంగీతో ఒకరి మృతి



మహేశ్

జగదేవ్‌పూర్(గజ్వేల్): డెంగీ బారిన పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తిమ్మాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొంత మహేశ్(32) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పది రోజుల క్రితం జ్వరం రావడంతో గ్రామంలోనే ఓ ప్రైవేటు క్లినిక్‌లో చికిత్స చేయించుకున్నప్పటికీ తగ్గలేదు. దీంతో మెరుగైన చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించి డెంగీ వ్యాధిగా గుర్తించారు. చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. శుక్రవారం స్వగ్రామమైన తిమ్మాపూర్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడు..



భూక్య భాస్కర్

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుదాఘాతానికి గురై యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గండిపల్లి గ్రామ పరిధిలోని పంచరాయితండాలో చోటుచేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన భూక్య ఈర్య-బుజ్జి దంపతులకు ముగ్గురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా కుమారుడు భూక్య భాస్కర్(18) హుస్నాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇటీవల ఐటీఐ పూర్తి చేశాడు. దీంతో కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ కాంట్రాక్టర్ దగ్గర పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం కరీంనగర్‌లో విద్యుత్ స్తంభం పైఎక్కి వైర్లు సరిచేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

వారంలోపు అందరికి యూరియా

- కృత్రిమ కొరతతోనే సమస్యలు
- ఎంపీ రఘునందన్ రావు

సిద్దిపేటజోన్: రాష్ట్ర అవసరాల మేరకు ఇప్పటికే యూరియాను కేంద్రం పంపించిందని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని వారంలోపు 50 వేల మెట్రిక్ టన్నుల యూరియాను తెస్తామని చెప్పారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఇతర దేశాల నుంచి దిగుమతి అయ్యే యూరియా ఆపరేషన్ సింధూర్ వల్ల సకాలంలో రాలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలు రైతులను గందరగోళానికి గురి చేస్తున్నాయని, ఎక్కడా యూరియా కొరత లేదని కృత్రిమ లైన్ పెట్టించి ఫొటోలు తీస్తున్నారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకం కింద అంగన్వాడీ, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం కోసం శంకుస్థాపనలు జరుగుతున్నట్లు పేర్కొన్నారు. మెదక్ పార్లమెంటు పరిధిలో 54 అంగన్వాడీలకు రూ.4.05కోట్లు, 28 గ్రామ పంచాయతీ భవనాలకు రూ.4.05కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో కేంద్రం వాటా 75శాతం ఉందని, రాష్ట్ర వాటా 25 శాతం ఉందన్నారు. కానీ కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, ఎంపీకి సమాచారం లేకుండా శంకుస్థాపన చేయడం సరికాదన్నారు. సమావేశంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు శంకర్, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్

పాపన్నపేట(మెదక్): ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినాయక మండప నిర్వాహకులు ఖచ్చితంగా నిబంధనలు పాటించాలన్నారు. అన్నివర్గాలు, మతాల ప్రజలు కలిసిమెలసి వేడుకలు జరుపుకోవాలని సూచించారు. మండపం ఏర్పాటుకు ఆన్‌లైన్ అనుమతులు తీసుకోవాలని చెప్పారు. డీజే సౌండ్‌లు ఏర్పాటు చేయవద్దని, శోభాయాత్ర సమయంలో కరెంట్ తీగలతో జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. ఆయన వెంట మెదక్ రూరల్ సీఐ రాజశేఖర్, ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, పోలీసులు, వివిధ పార్టీల నాయకులు, మతపెద్దలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసన్నకుమార్

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. పాపన్నపేట పోలీస్‌స్టేషన్‌లో మొక్కలు నాటి మాట్లాడారు. వర్షాకాలం మొక్కలు నాటేందుకు అనువైన కాలం కావడంతో ప్రతీ ఒక్కరూ ఒక్క మొక్క నాటాలని పిలుపునిచ్చారు. ఆయనతో పాటు ఏఎస్ఐ దేవిదాస్, కానిస్టేబుళ్లు శివకుమార్, వసంత్, నానుసింగ్, నర్సింలు, నాగలక్ష్మి పాల్గొన్నారు.

తమ్ముడిని కత్తితో పొడిచిన అన్న

ఆస్తి వివాదం నేపథ్యంలోనే ఘటన



గాయపడిన షేక్ బాబా

పటాన్‌చెరు టౌన్: ఆస్తి గొడవల నేపథ్యంలో సొంత తమ్ముడిపై అన్న కత్తితో దాడి చేశాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామంలో ఉన్న షేక్ బాబాకు, ఇస్నాపూర్‌లో ఉంటున్న అతని అన్న షేక్ మదర్ మధ్య కొంతకాలంగా ఆస్తి వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆస్తులు అమ్ముతున్నారంటూ షేక్ మదర్ ఇంటికి ఫోన్ చేసి షేక్ బాబా దురుసుగా మాట్లాడాడు. ఆ సమయంలో అతడు లేకపోవడంతో ఇంటికి వచ్చాక కుటుంబ సభ్యులు విషయం తెలిపారు. దీంతో షేక్ మదర్ తన తమ్ముడు ఉండే షాప్ వద్దకు వచ్చి నన్ను, నా భార్యను తిడతావా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలోనే షేక్ మదర్ పక్కనే ఉన్న కత్తి తీసి తమ్ముడి కడుపులో పొడిచాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలు అవ్వడంతో అతన్ని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి భార్య సమరిన్ భాను పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఎన్‌డీఎఫ్ పదార్థాల స్వాధీనం

మునిపల్లి(అందోల్): మత్తు పదార్థాలు తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కే.శ్రీనివాసరావు కథనం ప్రకారం... శుక్రవారం మండలంలోని కంకోల్ టోల్ ప్లాజా సమీపంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో జార్ఖండ్‌కు చెందిన అభయ్ కుమార్ గోవా నుంచి హైదరాబాద్‌కు ప్రైవేటు ట్రావెల్స్ బస్సులో వివిధ రకాల ఎన్‌డీఎఫ్ మత్తు పదార్థాలను తీసుకొస్తుండగా పట్టుకున్నారు. చరస్ 108 గ్రాములు, ఎండీఎంఏ 2.90 గ్రాములు, ఎల్‌ఎస్‌డీ పేపర్స్ 10 టాబ్లెట్స్, కొకైన్ 3.01 గ్రాములు, ఎండీఎంఏ ఎక్స్టా మాత్రలు 44 గ్రాములను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో సీఐ గాంధీనాయక్, ఎస్ఐ యాదయ్య, హెడ్ కానిస్టేబుల్ అలీం, యాదయ్య, రామారావు నాయక్, మల్కయ్య పాల్గొన్నారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

సంగారెడ్డి జోన్: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు ఇలా... శుక్రవారం జిల్లా టాస్క్‌ఫోర్స్, పోలీసులు కలిసి పట్టణంలోని గోకుల్ ఫంక్షన్ హాల్ ఎదురుగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన చిరంజీవి తన కారులో అక్రమంగా ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయి తరలిస్తూ పట్టుబడ్డాడు. నిందితుడి వద్ద నుంచి 5.402 కేజీల ఎండు గంజాయి, కారు, మొబైల్‌ను స్వాధీనం చేసుకుని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తనిఖీల్లో సీఐ శంకర్, ఎస్సైలు హనుమంతు, అనుదీప్, సతీశ్, శ్రీనివాస్ రెడ్డి, దిలీప్ రెడ్డి పాల్గొన్నారు.

సిమ్‌కార్డు పేరుతో సైబర్ మోసం

రూ.12 లక్షల 50 వేలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: మీ పేరుతో ఉన్న సిమ్ కార్డులపై కేసులున్నాయంటూ సైబర్ నేరగాళ్లు ఆర్థికంగా కొల్లగొట్టారు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... పటాన్‌చెరు పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి జూన్ 27న వీడియో కాల్ వచ్చింది. బాధితుడు లిఫ్ట్ చేయగా పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తి మాట్లాడి.. మీ ఆధార్‌పై ఇల్లీగల్ ట్రాన్సాక్షన్స్‌తో పాటు 17 కేసులు ఉన్నాయని చెప్పాడు. ఈ విషయంపై అధికారులతో మాట్లాడతానని బాధితుడ్ని భయభ్రాంతులకు గురి చేయడంతో పలు దఫాలుగా రూ.12 లక్షల 50 వేలు చెల్లించాడు. తిరిగి మరలా డబ్బులు అడుగుతుండటంతో మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అయ్యో పాపం..

చిన్నారులకు నాయనమ్మే దిక్కు

- నాలుగేళ్ల క్రితం తల్లి.. ఇటీవల తండ్రి మృతి
- ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు



నర్సింహులు



అనాథలైన చిన్నారులు

పుల్‌కల్(అందోల్): నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో అమ్మ, ఇటీవల బస్సు ప్రమాదంలో తండ్రి చనిపోయాడు. తల్లిదండ్రులను పోగొట్టుకొని చిన్నారులు దీనంగా చూస్తున్నారు. తల్లిదండ్రులు చనిపోవడంతో నాయనమ్మే వారి బాధ్యతలు చూసుకుంటుంది. ఈ హృదయ విదారకర ఘటన మండల పరిధిలోని మిన్‌పూర్‌లో జరిగింది. గ్రామానికి చెందిన మండలి నర్సింహులు(34) ఈనెల 19న పుల్‌కల్ బస్టాండ్‌లో బస్సు దిగే క్రమంలో కాలు జారి పడిపోయాడు. బస్సు చక్రాలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం సంగారెడ్డికి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుడి భార్య లక్ష్మి నాలుగేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతి చెందింది. కుమార్తె దుర్గాప్రసన్న(8), కుమారుడు అరుణ్‌కుమార్(7)ఉన్నారు. తల్లిదండ్రులను పోగొట్టుకున్న చిన్నారులను నాయనమ్మ దత్తమ్మ చూసుకుంటుంది. ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె వేడుకుంది.